కొంత మేలయింది. పదిరోజులదాకా జ్వరం తగ్గలేదు. మళ్ళీ యథాస్థితిలోకి వచ్చేటప్పటికి నెలరోజులు పట్టింది.

అప్పటినుండి చదువు గిదువు స్వస్తి వాచకాన్ని పఠించాయి. యశో నాదినచర్యలో పాల్గొంటున్నాడు. అతనికేవిధమైన కృతజ్ఞత చూపాలో నాకు తెలియటంలేదు. మనసులోనే ఆమువ్వురు మూర్తుల కనేకవేలనమస్కారాలను చేశాను. అంతకన్న చేయగలిగిందేముంది. యితరులకు ఎంతో జాలికలుగజేసే నాదీన హీనస్థితులు రక్తసంబంధం గలిన వారికి పట్టనప్పుడు అక్కడ ఎంతకాలమని వుండటం?

## ౪

కష్టాలు, దుఃఖాలు మనుష్యులను పలురకాల వ్యథల పాలుగావిస్తాయి. దుఃఖ మధిక మయినప్పుడు మనస్సు పరి పరివిధాల పోతుంది. దానికెక్కడా లంగరందదు. దుఃఖంలోనుండి కొందరు విరాగులౌతారు. అన్నీనావి. యిదినాది. నువ్వు నేను అని అన్నీ తన కన్వయించుకున్నప్పుడు వాటి వల్ల ఎడతెగని సంబంధం ఏర్పడుతుంది. వాటివల్ల వచ్చేకష్టనష్టాలకు ఓర్చుకోవలసి వుంటుంది. ఎల్లప్పుడూ వాటినే వాంఛించటం వల్ల మనస్సుకు విశ్రాంతి వుండదు. ఆలోచనలు అధికమై మనస్సు పరితాపం పొందుతుంది. దుఃఖాలవల్ల ఒక్కొక్కప్పుడు హృదయానికి తీరనిలోటు, మాయని గాయం ఏర్పడుతుంది. ఆ అవస్థలో నుండే వైరాగ్యదశలోకి ప్రవేశించుతారు కొందరు. యీదశ ఎవరో మహానుభావులకు తప్ప అందరికీ సాధ్య పడదు. అప్పుడు ఏవీ తనవి కావని, తాను తానే కాదని అంతా భగవంతుని స్వరూపమని భావిస్తాడు. అంతా మిథ్య అంటాడు. భార్య పిల్లలు యిత్యాది సంబంధాలన్నీ సాగరాన్ని యీదే మత్స్యాన్ని వల వేసి బంధించే సాధకాలని తలుస్తాడు. నిత్యానందం, స్వర్గ సౌఖ్యం అంతా భగవద్ధ్యానంలోనే లీనమై వుంటుందని భావిస్తాడు. అప్పుడతని భక్తి ప్రపత్తులు జీవితసాగరాన్ని దాటింప చేస్తాయి, ప్రశాంతమైన జీవితం గడుపుతాడు. 'ఇదినాదికాద' ని విడిచినప్పుడు మళ్ళీదాన్ని ఆపేక్షించి దానికోసం ఆరాట పడకుండా వుండగలగటమే వైరాగ్యంలోని ముఖ్యవిషయం. విషయవాంఛలను వీడి విశ్వమంతా తేజోమయుని స్వరూపంగా భావించి ధ్యానిస్తూ జీవితశేషం వెళ్ళబుచ్చుతాడాతడు. ఇటువంటి కష్టతరమైన వైరాగ్యాన్ని సాధించటం సామాన్యులకసాధ్యం; అందని విషయం. జీవితంలో భరింపరాని బాధలు కలిగినప్పుడు కొందరు వాటినుండి తప్పించుకుని దూరంగా పోవాలని యత్నిస్తారు. అందువల్ల స్వస్థానం వదిలి దేశాలపాలౌతారు. ఒకచోట గూడా మనస్సు స్థిరంగా నిలవక అనేక రకాల బాధలకు గురౌతారు. 'కష్టాలు కల కాలం కాపుర ముంటాయా!' అంటారు. కాని కొన్ని జీవితాలు శోధిస్తే పుట్టిన దగ్గర్నుంచి గిట్టేదాకా కష్టాలతోటే సరిపోతుంది. ఒక కష్టాన్ని గట్టెక్కటానికని పారిపోయి యింకొకచోట మరొక యిక్కట్టుకు గురౌతుంటాడు. ఒకచోట గూడా స్థిరచిత్తం లేక చంచలంగా గాలికి తిరుగుతుంటాడు. ఆజీవికి విశ్రాంతి అనేది వుండదు. కష్టాల కెదురీద తలుస్తాడు. కాని అవి అతన్ని నిలవ ద్రొక్కుకో నీయవు. పరాజితుడిని చేస్తాయి. చివరకు చాల వ్యథలకు లోనై జీవితాన్ని చాలిస్తాడు. యిటువంటి జీవులకు సుఖమనే దేమిటో తెలియదు. అనాథులై అస్థిర చిత్తాలతో, అంధులుగా అలమటించి అంతమొందుతారు. ఎక్కడా నిలువ ద్రొక్కుకోలేక పోవటం వల్ల వాళ్ళకు మనశ్శాంతి వుండదు. వచ్చిన కష్టాన్ని ఎదుర్కొనే శక్తి వారిలో లేదు. జీవితం దుఃఖభాజనం చేసుకుంటారు యిలాంటి వారంతా చేతులార! కొందరు కర్మ సాధారంగా తీసుకొని తలవ్రాసిన వ్రాత అంటూ అందులోనే మునిగి తేల్తుంటారు. అలాంటి వారికి కలిగిన మనో నిశ్చయాలలో లోపల క్రుంగదీసి జీవితాలను బలిగొంటాయి. 'నుదుట వ్రాసిన వ్రాత తప్పదు నూరేండ్లకైన' అని జీవితాలను కష్టపరం పరలకు లోను గావించి అనుభవిస్తారు. కష్టాలలో గూడా అవమానం కలుగజేసే విషయాలలో అతనిహృదయం మరీ నీచపరిణామము పొందుతుంది. అవమానంతో

క్రుంగిపోయే హృదయం కలకాలం ఆశతో వుండటం అసంభవం. అవమానితులు తమజీవితాలను బలి చేస్తారు. లోకులు కాకుల్లాగా పొడుస్తుంటారని అవమానితుడు ఆత్మహత్యకు పాల్పడతాడు. దుఃఖాన్ని తట్టుకోలేక శాశ్వతమైన శాంత ప్రకృతిని ఆశిస్తూ మృత్యువాతతడు పడతాడు. చేతులతో నిండు ప్రాణాన్ని తీసుకుంటాడు. పలురకాలుగా కష్టాలు మానవుల జీవితాలను బలిగొంటాయి.

♦ ♦ ♦

బడిచాలించిన దగ్గర్నుంచీ గొడ్లను కాయటం అలవాటయింది. ప్రొద్దున్నే చద్దిమెతుకులు తిని గొడ్లను దూరంగా అడవిలోకి తోలుకుపోవాలి. ప్రొద్దుగూకంగానే తోలుకు రావాలి. వాటిచాకిరీ అంతా చేసి ఏ అర్ధరాత్రికో మేనువాల్చేవాడిని.

ఒకరోజు గొడ్లను మేపుతుంటే తల్లిగొడ్డు ఒకటి తన బిడ్డకు పాలు గుడుపుతుంది. ఇది నేనుచూడలేదు. ఇంటికి వచ్చిం తర్వాత పాలుతీయబోతే అది తన్నింది. మళ్లీ గ్రంధం మొదలయింది.

'ఏం గాడిదలు కాస్తున్నావురా! దూడ పాలు తాగుతుంటే చూస్తూ వూరుకున్నావ్! యిట్లా ఐతే పొట్ట పగిలేట్టు పోసుకు తాగటానికెక్కడినుంచి స్తాయి!' అని అత్త బెత్తానికి పనిగల్పించింది. నోరు లేని జంతువునే నేనుగూడా! నేను జాలిగా ఆ ఆవు కళ్ళల్లోకి చూశాను. అది 'నాబిడ్డకు నేను పాలు కుడుపుకుంటే తప్పా!' అన్నట్లు చూసింది. నేనేం చెప్పను.

ప్రతిరోజూ యశోధర్‌ను గూడా నాతో అడవికి తీసుకు పోతుండేవాడిని. అక్కడ చెట్లెక్కి పండ్లు కోసుకుంటూ, పరుగెత్తుతూ కాలం గడిపేవాళ్ళం. యశో మధ్యాహ్నం పూట చెట్టుక్రింద కూర్చొని వేణువును వూదుతుండేవాడు. ఆ ఆలాపనవిని శ్రీకృష్ణుడు పిల్లనగ్రోవి వూదుతుంటే మోరలెత్తి ఆలకించే గోవుల్లాగా యీజంతువులు గూడా ఆలకిస్తుండేవి. అతని వేణుగానం వింటూంటే నేను ఏదో స్వర్గలోకంలో విహరిస్తున్నట్లుంటుంది. అనిర్వచనీయానందాబ్ధిలో మునకలేస్తున్నట్లనిపిస్తుంది. ఇటువంటి సంగీతంలో ఎంతమాధుర్యం వుందో అని ఆలోచిస్తూ ఎల్లప్పుడూ యిలాగు వుండిపోతే బాగుండు ననిపించేది!

ఆరోజు నేను గొడ్లను విప్పి పొలానికి బయలుదేరాను. ప్రతిరోజూ వెళ్ళేటప్పుడు యశోను కేకవేసి వెంటబెట్టుకు వెళ్ళేవాడిని. మామూలుప్రకారం వాళ్ళింటి ముందాగి 'యశోధర్!' అని కేకవేశాను. సమాధానం రాలేదు. పిలచినప్పుడు 'వస్తున్నానన్నో' 'నువ్వేరా!' అనో వినబడేది. మళ్లీ కేకవేశాను 'అన్నాయ్!' అని.

అభయ బైటికొచ్చి నన్నుచూచి 'నువ్వా! యశోను పనిమీద వూరికి పంపించాను. యివాళ రాడు; రేపువస్తాడులే నాయనా!' అంది.

నామనసులో ఏదో మెరపు మెరసి మాయమైంది. సరేనని నేనొక్కడినీ గొడ్లను తోలుకొని బయలుదేరి పోతున్నాను నిర్జనబయలు ప్రదేశంగుండా!

ఈరోజు యశోధర్ లేనిలోటు ఎక్కువగా కనిపించింది. అతడుంటే ఎంతో వుత్సాహంగా గంతులు వేసుకుంటూ పోయేవాడిని. నేడు నిరుత్సాహం నాలో ప్రవేశించింది. ఏమిచెయ్యటానికి పాలుపోవటం లేదు. తలవంచుకొని ఏదో ఆలోచిస్తూ పోతున్నాను. అతని వేణుగానం వినేభాగ్యం నాకు లేకపోయింది. గొడ్లు బయలుమేస్తున్నాయి. నాకు వాటిపైపు ధ్యాసపోలేదు. అవి ఏం చేస్తున్నదీ గమనించకుండా వున్నాను. ఎందుకో నన్ను దుఃఖం ఆవరించింది. తెలియని ఆవేదన నాలో ప్రవేశించింది. బిగ్గరగా ఏడ్చాను. అరణ్యంలో నారోదన ఎవరికోసరం! ఏమో! అనేక రకాల ఊహలు నాలో మెరపు మెరసినట్లు మెరిసి మాయమై పోయినై. యశోధరును యింక చూస్తానో లేదో! యీ ఊహ నన్ను మరింత బాధించ సాగింది. మాకు స్నేహం కలినదగ్గర్నుంచి ఒక్కరోజుగూడా మేము విడిచివుండ లేదు. ఈనాడిలా సంభవించింది. నాదీనావస్థనంతటినీ

నెమరువేసుకుంటూ కూర్చున్నాను. అలా ఎంత కాలం వున్నానో! నిద్రాదేవత నాహ్వానించాను. ఆమె దయతో నన్ను తన కౌగిలిలోకి తీసుకొని జోకొట్టింది. మధుర స్వప్నాలను కొన్నింటిని కన్నాను. ఒకచోట మా అమ్మవచ్చి నన్నెత్తుకొని ముద్దుపెట్టుకున్నట్లు కలగన్నాను. నిజంగా యీ నిర్భాగ్యుడికి అంత అదృష్టం కూడానా! నా అత్త దయ్యమై పీక్కు తింటానికి వచ్చినట్టుంది. ఆభీకరాకారం చూచి భయపడ్డాను. వణికిపోయాను. దగ్గరికి వస్తున్నది. భీతితో లేచి పరుగెత్తాను. అడవిలో చెట్ల సందుగుండా పరుగెత్తుతుంటే ఒకచోట చెట్టుకొట్టుకొని క్రింద పడ్డాను. 'అబ్బా!' అని వులిక్కిపడి లేచాను.

అంతా గాఢాంధకారం. ఎక్కడా ఏమీ కనబడటం లేదు. రాత్రయిందని తెలుసుకున్నాను. పశువులేమై వుంటాయి! వాటికి యింటి త్రోవ తెలుసు, వెళ్లుంటాయనుకున్నాను. యిప్పుడీ చీకట్లో యింటికేవిధంగా పోవాలని ఆలోచనలో పడ్డాను. నామనసెసరు తిరిగింది. ఇంటికి పోగూడదనుకున్నాను. ఏవిధాన్నైనా బ్రతకాలనుకున్నాను. వాళ్లకు చేసేచాకిరీ ఏపుణ్యాత్ములకైనా చేస్తే ఫలితం వుంటుందని యింటికి వెళ్లాలనే ప్రయత్నం మానేశాను. నా వారికి చెప్పకుండా వెళ్తున్నందుకు అనేక నమస్కారాలుచేసి క్షమించమని ప్రార్థించాను. ఇంక ఆయింట్లో నికృష్టపు జీవితం భరించటం అసంభవమని తలచాను.

ఈ అర్ధరాత్రప్పుడు ఎక్కడికి పోవాలో తోచ లేదు. ఆకలి మండిపోతూంది. ఎక్కడా దారికన బడటం లేదు. చెట్లను కొట్టుకుంటూ వాటిమధ్యలో నుంచి బయటపడ్డాను. బయలు ప్రదేశం వచ్చింది. యింటిదారి వదిలి వేరేత్రోవ తీశాను.

ఇంతరాత్రప్పుడు ఒంటరిగా అడవి ప్రాంతంలో ఎప్పుడూ ప్రయాణం చేయలేదు. అయినా బ్రతుకు మీది ఆశాభావం నన్ను ముందుకు లాక్కుపోతున్నది. కాళ్ళల్లో శక్తి వున్నంతవరకూ నడుస్తూనే వున్నాను. ఆకస్మాత్తుగా యశోధరు చెప్పినమాటలు గుర్తుకొచ్చాయి. 'దయ్యాలు మనుష్యులను వెంబడించి తీసుకుపోయి ఎక్కడో పడేస్తాయి! ఏమేమో చేస్తాయి!'

నేనాగిపోయాను. ఒంటరి వాడిని. అరణ్య ప్రాంతం. కటిక చీకటి. యశో మాటలు నన్ను మరీ భయస్థుడిని చేసినై. నాకాసమయంలో ధైర్యం చెప్పేవాళ్ళెవరున్నారు? నాలో నేనే ఊరడిల్లాను. చచ్చినా ఆదయ్యాల చేతుల్లో చద్దాం. అక్కడ వాళ్లు పెట్టేబాధకన్న యిదే నయమనే మొండిధైర్యం అవలంబించి మళ్లీ నడకసాగించాను. కొద్దిదూరం పోయి వెనక్కు తిరిగి చూచాను. ఏమీలేదు. కొంతదూరం నడిచాను. ప్రక్కన ఏదో గలగలమని శబ్దం వినిపించింది. పామేదైనా పోతున్నదేమో ననుకున్నాను. కాని దయ్యమేమోనని అనుమానం కలిగింది. వెనక్కు తిరిగి చూచాను. ఏమీ కనబడలేదు. దయ్యాలు క్రింద నడవ్వని యశో చెప్పాడు. ఆమాట గుర్తు చెప్పకొని దయ్యం మాత్రం కాదని నిశ్చయించుకొని ముందుకు పడి పోతున్నాను.

ఎక్కడనుంచో సన్నని వెలుగు కనిపిస్తూంది! దగ్గర్లోకి వెళ్లాను. ఎఱ్ఱగా మండుతూంది ఏమిటో. కొరివిదయ్యాలుంటాయని విన్నాను. యివి కొరివి దయ్యాలనుకున్నాను. అవి మనుష్యులను పట్టి పీక్కు తింటాయట. గుండె దడదడ కొట్టుకుంది. పరుగెత్తాను కొంతదూరం. వెనక్కు తిరిగిచూస్తే అది అక్కడే వుంది. కొరివిదయ్యాలైతే మనుష్యులను వెంబడించి పీక్కుతింటాయట, నానా బాధలు పెడతాయట. యీసంగతులన్నీ యశోధర్ దగ్గర విన్నాను. అదికాదేమో ననుకున్నాను. మళ్ళీ దాని వైపు నడకసాగించాను. దగ్గర్లోకి వెళ్ళేటప్పటికి ఒక శవం మండటం చూశాను. నాభయం కొంతవరకు తీరింది. శవాలను పీక్కుతింటానికని నక్కలు మొదలైనవి వస్తాయంటారు. కాని అవ్వేమి అక్కడలేవు. శ్మశానంలో అర్ధరాత్రి సమయంలో భూతప్రేతాలు దయ్యాలు నాట్యం చేస్తుంటాయని వాటి మాటలు గూడా వినబడతాయని అంటారు. కాని నిప్పుచూస్తే యివన్నీ భయపడి పోతాయిగదా అని అవిరాకుండా

అక్కడే ఆరాత్రి గడుపుదామనుకున్నాను. కొంతసేపు మనసు బిగబట్టి కూర్చున్నాను.

ప్రొద్దుటి నుండీ అన్నం నీళ్లూ లేవు. ఆకలి దహించుకు పోతున్నది. నాలికెండు తున్నది. ఇలా కూర్చోలేనని మళ్ళీ నడక సాగించాను అడవిలో మనుష్యులుగాని యిళ్ళుగాని కనిపిస్తాయేమోనని ప్రాణాలు కాపాడుకుంటే తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దామనుకున్నాను. శ్మశానవాటికలో శ్మశాన వైరాగ్యం అనుభవించాను కొంతసేపు.

◆ ◆ ◆

వైరాగ్యం మూడువిధాలు- ప్రసూతి వైరాగ్యం, భక్తివైరాగ్యం, శ్మశాన వైరాగ్యం అని. మొదటిది స్త్రీలకు సహజం, దాన్ని విపులీకరించ నక్కర్లేదు. రెండవరకం సామాన్యంగా హరికథలు పురాణగాథలు, భక్తుల చరిత్రాలు వింటున్నప్పుడు భక్తిపరవశులై ఆదేవుడిలో లీనమైపోయినట్లు, యీ జగత్తుతో తనకు ఏమీ సంబంధం లేనట్లు వైరాగ్యం అనుభవిస్తారు. అది అక్షణకాలం మాత్రమే. దీన్ని భక్తి వైరాగ్యం అంటారు. బంధువులో, ఆప్తులో, స్నేహితులో చనిపోయినప్పుడు మృత్యువు గుర్తుకొచ్చి 'ఎవరైనా ఏనాటికైనా మృత్యుగహ్వరాన్ని ప్రవేశించ వలసిన వాళ్ళమేగదా ! ఎందుకీపాడు తనువు! బ్రతికినన్ని రోజులు జీవికీ ఆరాటం తప్ప విశ్రాంతి అనేది వుండదు ! యీ శ్మశానం శాంతికి నిలయం. ఎంతకాలం జీవించినా చివరకి మట్టిలో కలిసి పోయేవారమే! "మట్టిలోనబుట్టి మట్టిలోన పెరిగి, మట్టిలోన గిట్టుమనుజరూపు శాశ్వతంబుగాదు శతజన్మములకైన!" అని అనుకుంటూ విరాగులౌతారు. దీన్ని శ్మశాన వైరాగ్యం అంటారు. జీవితంలో యీ వైరాగ్య సముదాయం నిలకడగా స్థానం ఆక్రమించుకోలేవు. అందువల్లనే ఆయాభావాలు వచ్చినప్పుడే క్షణకాలం మాత్రం ఆయా వైరాగ్య దశల్లోకి పోతారు. అంతే మళ్ళీ యథాస్థితిలోకి వస్తారు. ఆ వైరాగ్యస్థితి అలాగేవుండి స్థిరచిత్తంతో అనుభవించే వాళ్లు ఏశతకోట్లకో ఒక్కడుంటాడు. అతడే మహాపురుషుడు, త్యాగి, ధర్మి ! అతడే భగవత్స్వరూపం తెలుసుకో గలుగుతాడు. ఈ వైరాగ్య దశలు గూడా మనుజుని జీవితంలో అవసరం. జీవితంలో సౌఖ్యం ఎంత అవసరమో దుఃఖం, వైరాగ్యం గూడా అంత అవసరం. దుఃఖితులు శ్మశానవైరాగ్యం ఎక్కువగా అనుభవిస్తుంటారు. అప్పుడు వారి మనస్సులు కొంత కలత దేరుతాయి. క్రమంగా దీనిమూలకంగా దుఃఖోపశమనం కలుగుతుంది. దుఃఖసముద్రాన్ని యీదటానికి భక్తి శ్మశాన వైరాగ్యాలు నావలుగా ఉపయోగిస్తాయి. కాని కొందరు వాటిని తెలుసుకోలేక దాటటానికి బదులు అందులో మునిగిపోతారు. ఇదందరికీ సాధ్యం కాదు. ప్రయత్నిస్తే జరగని పనిలేదు. స్థిరచిత్తుల కైనా సాధ్యమౌతుంది. చంచలచిత్తుల కెక్కడా ఎప్పుడూ శాంతి లభ్యంగాదు.

ఆనాడు యశోధర్ నేనూ కలసి వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన నాకు బాగా గుర్తు, నేటికీ కళ్ళకు కట్టినట్టుంది. యశో, నేనూ వెన్నెలరాత్రుల్లో కాలవ మీద ప్రయాణం చేసే వాళ్ళం. ఆనాడాతడు నన్ను తీసుకువెళ్ళాడు. కొయ్య చెక్కలతో చిన్న తెప్ప తయారు చేశాడు యశో. అది మాయిద్దరికీ కాలవమీద వాహకంగా వుపయోగపడేది, యిద్దరమూ కలసి తెప్ప ఎక్కాము. ప్రవాహం అనుకూలంగా వుండటం మూలకంగా తెప్పదానంతటది నీటిమీద తేలిపోతున్నది. సువాసనా పూరితమైన గాలివీస్తూ నావను కదిలిస్తున్నది. మేమిద్దరం హాయిగా నీటిమీద ఉయ్యాల లూగుతున్నాము. యశో ముక్కానీపట్టాడు. చంద్రకాంతుల్లో మిలమిల మెరుస్తూ, గాలిచే అలలలుగా వస్తూ, తెప్పకు తగిలి యథారూపాన్ని పొందుతున్న స్వచ్ఛమైన నీటికాంతుల్ని తేరిపార జూస్తున్నాను నేను. చల్లని వెన్నెల్లో, నిశ్శబ్దమైన వాతావరణంలో నేనూ నా భ్రాత, జలతరంగాలపై తేలియాడుతూ పోతున్న చిరుతెప్ప మీద ఒంటరిగా మేనులు మరచి ప్రయాణం చేస్తున్నాము. నేనీలోకంలో లేను. ఏవిస్వీధిలో విహారం



(సశేషము)

# శ్రీధర

శ్రీ చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి

(గతసంచిక తరువాయి)

ఏవిన్వీధిలో విహారం చేస్తున్నానో తెలియటంలేదు. అనిర్వచనీయానందోత్సాహ డోలికలలో నాజీవి ఊగులాడుతున్నది. నాప్రాణస్నేహితుడెలావుందీ నాకు తెలియటంలేదు. ఇంటిదగ్గర పొందిన సకలమైన బాధలు ప్రాణాధిక ప్రియుడైన అన్నముందర, ఆహ్లాదకరమైన చంద్రుని శీతలకిరణ ప్రసారంలో, మలయపవనుని మధుగంధాన్ని మధుపును గ్రోలినట్లు గ్రోలుతూ, జలతరంగాల నడుమ డోలికగా ఊగుతూన్న ప్రాణమైన జీవనౌకలో ఉన్నప్పుడు, మాయమై స్వర్గసౌఖ్యాలలో మునిగి తేల్తునట్లుతోచింది నాకు. ఇంతవరకు జీవితంలో ఏవిధమైన సుఖమూ అనుభవించలేదు. ఆసమయంలో నా ఆనందాన్ని వర్ణించి వ్రాయటానికి నాకు మాటలు దొరకటంలేదు. ప్రకృతి జీవులకెంత హృదయాహ్లాదం కలిగిస్తుందో నాకు కొంతకాలానికి గాని తెలియలేదు. మానవునకు ప్రకృతితో సమానమైనశక్తిగల ఆప్తమిత్రుడు మరెవ్వడూ లేడు. సుఖమయ జీవితానికి ప్రకృతే మూలాధారం. మానవుడు జీవించటానికి; సృష్టిస్థితి లయాలకు గూడా ప్రకృతే ఆధారభూతం. తేజోమయ సౌందర్య రూపరాశి ప్రకృతి కాంత! ఆమె తన ఒడిలో కోటానకోట్ల జీవుల్ని జోకొడుతుంది! అనేకులను తనలో లీనంచేసుకుంటూ, మరి కొందరిని లోకసంచార్యానికి పంపిస్తుంది. సర్వాంగ శోభితయై ఎల్లప్పుడూ సుందరతర నాట్యవీధుల్లో నటిస్తుంది. తనను ఆరాధించే వారికి ఎల్లప్పుడూ ప్రసన్నచిత్తయై వారి ముందునిలిచి కోర్కెలీడేరుస్తుంది. సుఖంగా జీవితం సాగించే వారికి అధిక సంతోషం చేకూరుస్తుంది ప్రకృతి సుందరి. కాని వ్యర్థ జీవులకు ప్రకృతితో సమానమైన వైరి మరియొకటిలేదు. సమస్తచరాచరులను తన గర్భంలో యిముడ్చుకుంది, సర్వశక్తులు ఆమెలో లీనమైవున్నాయి. దుఃఖోప శమనానికి దీనబంధువు యీ ప్రకృతి కాంత. ఆమె నన్నిప్పుడు తన ఒడిలోకి తీసుకు 'జో' కొడుతున్నది. ఎంతకాలం యిలా ఆలోచిస్తూ కూర్చున్నానో! యశోధరు పిలిచేదాకా నాకుస్మృతిరాలేదు!

'శ్రీధర్! ఎక్కడనుండో ఏడుపు వినబడుతుంది. చూడు!'

ఉలిక్కిపడి లేచి కలయచూచాను. అంతా అరణ్యమయం. నదిగట్టున చెట్లు గుబురుగాపెరిగి వున్నాయి. చంద్రుడు పశ్చిమానికి వ్రాలాడు. ఎక్కడనుంచో సన్నగా ఏడుపు వినిపిస్తున్నది. ఈనిర్జన అరణ్యప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో ఏడ్చేవారెవరా! ఎందుకొరకు విలపిస్తున్నారో అని ఆలోచించాను. నాకేమీ తెలియటంలేదు. యశోధరు పడవను ఒడ్డుకు పట్టించాడు. యిద్దరం దిగాము.

'ఈ అడవిలో గుండానే వినిపిస్తున్నది! ఏమిటో చూసొద్దామురా!' అన్నాడాతడు. మాట్లాడకుండా అతన్ని అనుసరించి పోతున్నాను. ఒకప్పుడు యశో 'దయ్యాలూ భూతాలూ, ఒంటరిగా వున్నప్పుడు మనుష్యుల్ని తమదగ్గరికి రప్పించుకోటానికి ఏడుస్తునట్లు ధ్వనిచేస్తాయని, దగ్గిరికి రావటంతోటే అతనిని చంపేస్తాయని చెప్పాడు. యిది గుర్తుకు రాగానే నావళ్ళు పులకరించింది. గుండెవేగంగా కొట్టు

కోవటం మొదలు పెట్టింది. నడుస్తున్న వాడిని వెంటనే ఆగిపోయాను. కాసేపటికి అన్న వెనక్కి తిరిగి చూశాడు.

'అక్కడ నుంచున్నావేం! రా!' అన్నాడు. నాకు మాటపెకిలి రాలేదు. దగ్గరకొచ్చాడు! 'ఎందుకూ ఆగిపోయావు!' నేను మాట్లాడలేదు.

'ఏం భయపడ్డావా!' అని వీపుచరిచాడు.

భయంకొద్దిగా తగ్గి నడక సాగించాను.

మధ్యలో 'యీ ఏడుపు దయ్యందేమో!' అన్నాను.

యశోధరు నవ్వాడు.

'ఎందుకు నవ్వుతావు?'


'దయ్యాలు యిలాగ ఏడవ్వు!'

'ఏమో ఎవి ఎలా ఏడుస్తయ్యో' ననుకున్నాను.

చెట్లసందుగుండా పోతున్నాము. పాములూ తేళ్ల భయం చిన్ననాడే పోయింది. ఇలా అర్ధరాత్రుల్లో నిర్భయంగా సంచారం చేయటం అలవాటుపడ్డది. నాప్రాణ స్నేహితుడి మూలకంగా! ఎన్నిసారులో నేనొక్కడినే ఒంటరిగా తిరిగాను గూడా దుఃఖోపశమనం కలిగేందుకు. దారితెన్నూ లేకుండా ఆచెట్ల మధ్యగుండా ఒక చిన్నబయలు ప్రదేశం చేరుకున్నాము. దూరాన ఏదో ఒక ఆకారం గోచరించింది. దగ్గరికి వెళ్తున్నాము. అదొకమానవాకారమని తెలిసింది. హృదయం వ్రక్కలయ్యే విధంగా ఏడుపు వినిపిస్తున్నది. దగ్గరికి వెళ్లాం. ఆమె ఒక స్త్రీ! ఒళ్ళో ఒక పిల్లవాడు! అప్పుడర్థమయింది, తన పిల్లవాడు చనిపోయినందు కామె ఏడుస్తున్నదని. ఆదుఃఖం ఎంతటి కటిక గుండెనైనా కదిలించి వేయగలదు. ఆమె మమ్మల్ని చూచి మరీ ఎక్కువగా దుఃఖించ సాగింది.

యశోధరు దగ్గరకువెళ్ళి ఏదో మాట్లాడుతున్నాడు.

నేను ఆమె మాతృత్వపు ప్రేమను, ఆమె ఒడిలోని పిల్లవాడిని చూస్తున్నాను. యీనిర్భాగ్యుడికి దేవతామూర్తియైన తల్లియొక్క ప్రేమాదరణాలు లభించలేదు. తల్లిచేతుల్లో పుట్టిపెరిగి ఆమెచేతుల్లోనే హాయిగా శాశ్వత సుఖనిద్ర జెందుతున్నాడా పసిపిల్లవాడు. తల్లిని చూడటానికైనా నోచుకోలేక పోయాను. దేవతామూర్తి యీదౌర్భాగ్యుని కెలా లభిస్తుంది. మాతృత్వమంతా ప్రేమ స్వరూపంగా మార్చి, తన ప్రేమతో నింపి, తనివితీర హృదయానికి హత్తుకుండేటప్పుడు పొందే ఆనందం యీఅదృష్టహీను డనుభవించలేక పోయాడు. నన్నిలా నరక కూపంలో విడిచి తాను హాయిగా శాశ్వతానంద సమాధిలో నిలిచివుంది. తల్లికి బిడ్డపైనుండే మమత, ప్రేమ, కరుణ, జాలి, యివన్నీ యీమెలో నాకు గోచరిస్తున్నాయి. పదినెలలు మోసి కని పెంచి కాలాని కర్పించిందాశిశువును. ఆమె ఏం చేస్తుంది. కాలం తన భయంకర గహ్వర ద్వారమైన నోరు తెరిచి నాలుక చాచి మదించి మ్రింగుచున్నది. కాలానికి జాలి ఎక్కడుంటుంది. ఎంతవారినైనా, ఎట్టివారినైనా, విచక్షణాజ్ఞానం అవసరం లేకుండా తనలో



రోహిణీవారి 'ప్రతిజ్ఞ' లో సావిత్రి

లీనం చేసుకుంటుంది. తల్లికి బిడ్డకు వేరుచేసి ఆయమను దుఃఖ సముద్రంలో ముంచిపోయింది. ఆ స్త్రీ దీన దృక్కులూ, హృదయ విదారకమైన ఏడుపూ నాహృదయాన్ని గాయపరచినై! మాతా పితృ విహీనుడనై, ఎవ్వరి ప్రేమకు నోచుకోక జీవచ్ఛవంలా గావున్నాను. స్వర్గంలోనో, వాయువులోనో విహరిస్తున్నాయి వారి ఆత్మలు. నన్ను గూడా మీలో కలుపుకోమని అనేకవిధాలుగా ప్రార్థించాను ఏడ్చాను. కాని వాళ్ళకు నామీద దయగలగలేదు. యింకా యీజీవితమంతా దుఃఖసముద్రంలో యీదమన్నారు. అంతవరకూ వారిదరిచేరే అర్హత నాకు లేదేమో!

ప్రపంచంలో ఏజీవి బ్రతికినా ఒక ఆశయం, ఒక లక్ష్యం మీద నడుస్తుంది. అలాగాక ఎందుకూ కొరగాని జీవితమైందినాది. ప్రపంచంలో నేనుఫలానా వాడినని చెప్పుకుండే అర్హత గూడా లేదు నాలో. ఎవడినో, ఎక్కడ పుట్టానో, ఎలా పెరుగుతున్నానో, ఇంకా ఎలాబ్రతుకుతానో ఎవరికి కావాలి! జగతిలో నేనొకడినే అనామకుడిని! యిక్కడనాకు శాంతి అనేదిలభించదు. మృత్యువైనా నామీద దయతలచగూడదా! యీకష్టాలు పడుతూ వ్యర్థ జీవితం గడపటానికేనా నన్ను భూమి మీద పడేసి తాను భర్త సన్నిధి కేగింది. తన ఒడిలో హాయిగా ఆడుకుని పాడుకునే అదృష్టం లేకుండా చేసిపోయింది. కాదు నేనే పోగొట్టుకున్నాను. నావంటి నిర్భాగ్యుడింకెందుండబోడు. ధనమున్నంత వరకే దరిజేరుతారు అంతా. తర్వాత ఆదరించే దిక్కు గూడా లేకుండా పోయింది. యీపిల్లవాడి అదృష్టం ఎంతో పోల్చుకో లేకుండా వున్నాను. తల్లి బిడ్డలకు ఎడతెగని సంబంధం కాలప్రవాహం తెంపివైచినా ఆసంబంధం స్వరూపంతో నశించిపోదు. ఆత్మదుఃఖం అలముకొని అలమటించి పోతున్న ఆదీనురాలి అవస్థ వర్ణించటం అశక్యం. నేనే ఆమెగర్భవాసాన ఎందుకు పుట్టకపోయాను. అలా అయితే కొంతవరకైనా మాతృత్వ ప్రేమ ననుభవించి వుండేవాడిని. యిటువంటి దుఃఖికి అటువంటి సద్గతులు



రోహిణీవారి 'ప్రతిజ్ఞ' లో గిరిజ

కలుగుతాయా, ఆజీవి ఎవరో! ఎంతపుణ్యం చేసుకు పుట్టాడో! బ్రతికినన్ని రోజులు తల్లి చేతుల్లో పెరిగి ఆమె ప్రేమను సంగ్రహించి, ఆనందంతో తన జీవితాన్ని ముగించాడు. ఆనందంతో అంతం కావటం కన్న ఆరాధించ తగ్గదేది? తన్ను కని పెంచిన తల్లికరచరణాల్లో తన జీవితాన్ని చిరునవ్వులో ముగించుకున్నాడు. వెళ్తూ తన తల్లి హృదయాన్ని గూడా తీసుకు వెళ్ళాడు. ఇంక తనకావల్సిందేమున్నది. నాజీవికి అంతం ఎప్పుడో అప్పుడే యీదుఃఖ మంతమౌతుంది.

పూర్వజన్మ అనేది నాకుండినట్లైతే నేనా జన్మలో ఏమాతా పుత్రుల కెడబాటు కల్గించానో ఆఫలితం యిప్పుడనుభవిస్తున్నాను. తల్లికి బిడ్డకు వేరుచేసి తమ కోర్కెలను కొనసాగించుకుందుకు చూస్తారు కొందరధమాధములు. నేనుగూడా వారిలో వాడినేమో! చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం అనుభవించక తీరదు. యీకర్మ సిద్ధాంతం నాహృదయానికి హత్తుకుంది. యీసిద్ధాంతం మీదనే జీవితాలు

జరిగిపోతుంటాయి. కొందరు అంతా తమ స్వశక్తివల్లే అవుతున్నాయనుకుంటారు. అది కేవలం వివేకహీనం. ఏక్షణంలో ఏవిధమైన ఆపద రాబోతుందో లేక సంఘటన జరగబోతుందో, మరునిముషంలో జరగబోయేదేదో తెలుసుకోలేం! దీనింతకూ కారణభూతమైంది ఒకటుండాలి. అదే కర్మసిద్ధాంతం. దీన్నిబట్టే సకల జగత్తూ నడుస్తుంది. చేసిన పనినిబట్టి ఫలితం అనుభవించటం సహజమేకదా! అలాగే యింతకు ముందు చేసిన పుణ్య పాప కార్యాలవల్ల సుఖ దుఃఖాలను అనుభవిస్తాము. సుఖాలలో మనుజుడదంతా తన స్వశక్తిమీద ఆధార పడిందంటాడు. దుఃఖాలలో అంతావిధి అంటాడు. విధియైనా ఏదైనా కర్మ అనే అర్ధం. వ్యాపారంలో లాభం సంపాదించితే అదంతా తను కష్టపడి సంపాదించిందంటాడు. నష్టమైతే యితరులమీద పెట్టి ఏవో సాకులు చెపుతాడు. యిదే జీవిత పథంలోగూడా జరుగుతుంటుంది. దుఃఖసమయాల్లో మానవుడు కర్మ సిద్ధాంతాన్ని విస్మరించి తనకు తానోదార్చుకుంటాడు. ఇదేనాపరిస్థితి ఆసమయంలో! కాని విచక్షణా జ్ఞానం నాలోలేదు. యీకష్టాలనుభవించటం పరిపాటౌతున్నది. మితిమీరినప్పుడు మృత్యుశయ్యదగ్గరకు పరుగెత్తుతున్నది. కాని మళ్ళీతిరిగి వస్తున్నది. అందుకు కారణం ఏమో! ఎందువల్ల నా అంతట నేను మృత్యువును చేరలేకుండా వున్నానో! సుఖభోగలతో జీవించేవారికిగాని నావంటి నిర్భాగ్యపు జీవికెందుకు ప్రాణం మీద యింతతీపి. యిది కాలమహిమ అనుకుండేవాడిని.

అప్రయత్నంగా నాకళ్ళవెంబడి నీరుకారుతుంది. నేనది గ్రహించలేదు. యశో నాభుజంమీద చేయివేసి తట్టితేపేదాకా యీ లోకంలో లేను.

'ఎందుకు ఏడుస్తున్నావ్!'

ఏం చెప్పనూ?

'పాపం! యీమె తన బిడ్డకోసం అల్లాడి పోతున్నది. తన భర్త పోయినదగ్గర్నుంచీ ఆపసికూనను సాకుతూ, తన ఆశలన్నీ అతనిమీదనే పెట్టుకొని వున్నది. కాని ఆమెకోరిక ఫలించలేదు. ఆపిల్లవాడు రెండురోజులు జ్వరంపడి నిన్ననే చనిపోయాడట. అన్నం నీళ్లూ లేకుండా నిన్నటినుంచీ యిక్కడే తన కొడుకుకోసం ఏడుస్తూవుంది. నువ్వెందుకేడుస్తావ్. ఏం జేస్తాం! మానవుడెంతటి వాడైనా కాలానికి లోకువే! ఒకని కొకడు సానుభూతి చూపగలడు కాని చనిపోయినవాడిని బ్రతికించలేడుగదా! మృత్యువు నడ్డుకొనేవాడు లేడు అన్నాడు. యశోధర రుద్ధ కంఠంతో మెల్లగా!

నేను కన్నీళ్ళు తుడుచుకొని బయలుదేరాను. యశో నన్ననుసరించాడు. యింటికిచేరిందాకా ఒకరితో యింకొకరం మాట్లాడనేలేదు.

(సశేషం)


## బిల్వ, వేప

బిల్వ, వేప అను జాతీయమూలికలనుగూర్చి శాస్త్రవిషయక పరిశ్రమచేసి వ్రాయబడిన ఉత్తమ గ్రంథరాజములు. ఈ మూలికల ఓషధిగుణము, వైద్యప్రయోగమ్ములు, శాస్త్రచర్చ, పురాణ వివరము, సరళశైలిలో వివరింపబడినవి. వైద్యులకు, భక్తులకు మిక్కిలి ఉపయోగకరమైన గ్రంథములు. క్రౌనుసైజున మంచి ఫెదరువైటు కాగితములమీద ముద్రింపబడి గృహలక్ష్మి గ్రంథమాలలో ద్వితీయ తృతీయ కుసుమములుగా ప్రచురింపబడినవి.

గ్రంథకర్త: కే. యన్. కేసరి ప్రతి 1-కి 0-12-0

గృహలక్ష్మి కార్యాలయము, రాయపేట :: మద్రాసు.

# శ్రీధర

శ్రీ చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి

(గతసంచిక తరువాయి)

## ౬

ఈవిషాద ఘట్టం గుర్తుకొచ్చేటప్పటికి నామేను పులకరించింది. శరీరంలోని రక్తం వేగంగా ప్రవహించింది. ఆ నిశీథి సమయంలో నిగూఢంగా నాజననీ జనకులకు అశ్రుపూరితమైన నేత్రాలతో నమస్కరించాను. మొండి జీవం నాది! సున్నిత హృదయాలను ఎలా తెలుసుకో గలుగుతుంది? నాకన్నీళ్లు ఎవరికి కనబడతాయా అంధకారబంధురమైన జగత్తులో! పగటి వేళలోనైనా అరణ్య రోధనం పశుపక్ష్యాదులైనా గుర్తిస్తాయి. అవిమాత్రం ఏం చేయగలవు? 'కూయిడు'తూ తమ సంతాపాన్ని తెలియజేస్తాయి కాళ్ళల్లో ఎన్ని ముళ్ళు నివసిస్తున్నాయో అప్పటికీ యిప్పటికీ నాకు తెలియదు. వాటిమీద నడవటం నల్లేరుమీద బండి పోవటం లాగయింది.

అశ్మశాన వాటిక దూరమౌతున్నది. సన్నని వెలుగు అంతమౌతున్నది. నిశ్శబ్దదేవత జగమంతా వ్యాపించింది. కాని ఆమె నాహృదయంలో ప్రవేశించలేకపోయింది. నిద్రాదేవతకు గూడ ఎక్కువై పోయాను. ఆమె తన చల్లని చేతులతో ఒడిలోకి 'జో' కొట్టనైనా లేదు. నిశాచరుడినైన నాకు నిద్రాహారాలేమిటి? అన్నిటినీ విసర్జించిన వాడికి నిద్ర ఒక్కటి ఎక్కువా? అలానే గుంటల్లో పడుతూ, మిట్టలు ఎక్కుతూ, చెట్టుపుట్టలు దాటుతూ హృదయావేగంతో భారమైన శరీరంతో తూలుతూ ఏడుస్తూ నిబిడాంధకార నిశీధిని నిశాచరుడిలాగా నిర్భీతితో సంచరిస్తున్నాను. భూత ప్రేతాదులు గూడా నన్ను చూచి భయపడినాయేమో! దగ్గరికి చేరలేదు, ఇలాంటి రాక్షస ప్రకృతి గల మానవుడిని చూచి ఏభూతం భయపడదు? అవి ఏరూపంలోనూ కనబడలేదు.

నిర్జన కీకారణ్యంలో చెట్లమధ్యనుంచి అష్టమి చంద్రుడి పసిడి కిరణాలు అక్కడక్కడా వ్యాపించి వాటి నిజస్వరూపాలను అర్ధనగ్నంగా తెలియజేస్తున్నాయి. చంద్రుడిని చూచి కొన్ని పక్షులు కిలకిలమన్నాయి. కొన్ని గాలిలో కెగిరినాయి. మలయ పవనుడు విజృంభించి చెవులనందుకుండా శర వేగంతో దూసుకు పోతున్నాడు. హిమం కురియటం మూలకంగా భూమి అంతా చల్లగ వుంది. నాదేహం తడవిచూచుకున్నాను. చల్లగా మంచు గడ్డలావుంది. ఇంతవరకు గుర్తించనేలేదు! గుర్తించి మాత్రం ఏం ప్రయోజనం? వంటిమీద మాసికలు వేసిన చిన్న చొక్కా, చిన్నలాగు తప్ప దేహాధారణకింకే ఆధారమూలేదు. గడ్డి అక్కడక్కడా దుబ్బులు దుబ్బులుగా పెరిగివుంది. ఒకటిరెండు పాములు నాముందుగా గడ్డిలోనుండి పరసరమని ప్రాకి పోయినై. గమ్యస్థానం లేని కడలి నౌకలాగా దారి తెన్నూలేకుండా తిరలి పోతున్నాను.

ఒకసారి నాచుట్టూ కలయచూచాను. గాఢాంధకారం కన్నుపొడుచుకున్నా ఏమీకనబటం లేదు. క్రమంగా నక్షత్రాల గుడ్డివెలుగు గూడా మాయమౌతున్నది. వాయుదేవుడు ప్రళయ తాండవనృత్యం మొదలు పెట్టాడు. కారు మేఘాలు గగనసీమను కప్పివేసి ఘూర్ణిల్లుతున్నాయి. మెరపు దీపెలు కన్నులను కటికచీకటిలోకి లాక్కుపోతున్నాయి. చెట్లన్నీ

దేహా సంచలనం గలిగి ఉర్రూతలూగుతున్నాయి. తమ ఆధారభూతమైన వృక్షసముదాయాని కాపద వాటిల్లుతున్నట్లుగా పక్షులు కిలకిలారావముతో అడవి ప్రదేశాన్ని మారుమ్రోగిస్తున్నాయి. తమ పసికూనలను కాపాడుకోలేని అసహాయ స్థితిలో వుండి తల్లులు దీనాతి దీనంగా కూయుచుతున్నాయి. దూరాన్నుండి నక్క కూతలు వినబడుతున్నాయి.

నామేను గగుర్పొడిచింది. చలివేయసాగింది. ఎటుపోవటానికి దారితెలియటంలేదు. చిట పటమని చినుకులు ఆరంభమైనై. ఏదైనా పెద్దచెట్టు క్రిందకు పోయి నిలబడదలంచి చెట్లుకొట్టుకుంటూ పోతున్నాను. ఉరుములు మెరుపులు అధికమైనై. ఏనుగు తొండంతో చిమ్మినట్లు, కడవలతో కుమ్మరించినట్లు వర్షం జోరుగా కురియసాగింది. గాలి తన శక్తినంతటినీ ప్రదర్శిస్తున్నది. గుడ్డలు శరీరాని కంటుకుపోయినాయి. దేహమంతా తడిసింది. ఒక సరివిచెట్టును కొట్టుకున్నాను. ముఖాన గాయమైంది. రక్తం కారుతూంది. చేతులతో తడువుకుంటూ గుడ్డివాడిలాగా, వణుకుతూ చెట్ల సందుగుండా పోతున్నాను. వెళ్ళి వెళ్ళి ఒక ముళ్ళకంపలో పడ్డాను. అప్పుడు నాస్థితి వర్ణించటానికి శక్యం కాకుండా వుంది. వళ్ళంతా జీరుకుపోయింది. వర్షపు నీటితో బాటు నారక్తంగూడా భూదేవి తనువుపై ప్రవహిస్తున్నది. కొన్నిముళ్ళు శరీరంలోకి దిగినై! కన్నులలోకి గుచ్చుకు పోయేవేకాని యింకా భూమి మీద యీపాపిష్టి కళ్ళతో మిగిలిన బాధలు అనుభవించాల్సి వున్నందుకది సంభవించలేదు.

అక్కడినుండి లేచాను. మెల్లగా ఒక్కొక్క ముల్లుతీస్తుంటే రక్తం చిమ్మికొడుతున్నది. బాధ ఎక్కువైంది. నాశరీరం అరుణశోభను దాల్చిందో లేక వరుణ దేవుడిలో కలిసి మామూలు స్వరూపాన్ని ధరించిందో తెలియదు. స్మృతితప్పి పడిపోయే పరిస్థితి ఏర్పడింది కాని అట్లా జరగలేదు. అలాగే దెబ్బలు కొట్టుకుంటూ ఒక చెట్టు క్రిందకు జేరాను. శరీరంలో పొడి ప్రదేశమనేది ఎక్కడాలేదు. బాహ్య శరీరాన్ని వరుణదేవుడు తడిపాడు. హృదయంలోపల దుఃఖాశ్రువులచే పొడి ప్రదేశమే లేకుండా పోయింది. ఎదేవత గూడా ఉపశమింపకుండా తమశక్తినంతటినీ ప్రదర్శిస్తున్నారు. ఆవిజృంభణను అరికట్టలేక కొన్ని చెట్లు పెళ పెళమని నేల కొరిగాయి. కొన్ని నడుమువాల్చాయి. నేనుకూర్చున్న చెట్టుపెద్దది కావటం వల్ల అంతగా భయపడాల్సిన అవసరం లేకపోయింది. ఆచెట్టుమీద ఉన్న పక్షులన్నీ నాలాంటి అసహాయులే. నా ఆక్రందనంతో వాటి ఆక్రందనం మిళితమై ప్రకృతి దేవతను వేడుకుంటున్నది. అవి ఒకకొమ్మ మీదనుండి యింకో కొమ్మమీది కెగురుతూ విలపిస్తున్నాయి. నావిలాపం వాటివిలాపం ఆలకించేదెవరు ఆ కాననంలో? ప్రకృతి దేవతకూడా మాపై పగబూనింది. అటువంటప్పుడు యింక చేసేదేమున్నది.

దేహం మీదవున్న దుస్తులను తీసివేద్దామనుకున్నాను. కాని అవి సహజ కవచాలలాగా అంటుకొనిపోయినై! తలంతా బాగా తడిసింది. కేశ సంస్కారం లేక దుబ్బుగా పెరిగివున్న జుట్టుకావటం వల్ల జలుబు చేస్తుందేమో ననుకున్నాను. చలిగాలిలో గాయాల మూలకంగా వళ్ళంతా పోట్లుపుడుతున్నది.

*　　　*　　　*

స్మృతి వచ్చేటప్పటికి చంద్రుడు నడినెత్తిన ఆడుతున్నాడు. అప్పటి వరకూ మేఘాలచే కప్పబడి వికృత రూపం దాల్చిన వాడిప్పుడు పసిడికాంతులను యీ అడవిమీద ప్రసరింప జేస్తున్నాడు. నా అరణ్యరోదన ఆయన అడవిగాచిన వెన్నెల రెండూ ఒక్కటే అయినాయి. చుక్క కన్నెలు చంద్రుడితో పరిహాసాలాడుతూ అతని గమనాన్ని అనుసరిస్తున్నాయి. చిరుమబ్బులు చెంగు చెంగున పరుగెడుతూ అదృశ్య మౌతున్నాయి. మలయ పవనుడు మధుగంధవాహనుడైనాడు.

నామేనొక్క సారిగా గగుర్పొడిచింది. గుడ్డలు కొద్దిగా ఆరినై! అక్కడక్కడ రక్తపు మరకలున్నాయి. కొన్ని కొన్ని గాయాలనుంచి రక్తం వస్తూనేవుంది కొద్దిగా!

లేచాను. కాళ్ళు తడబడుతున్నై. రక్తం అధికంగా పోవడం మూలంగా నీరసంగా వున్నది. ఆకలి బాధించసాగింది. వేటికి దూరమైనా నిద్రాహారాలకు దూరం కాలేకుండా వున్నాను. ఆకలి దహించుకు పోయేవానికి ఏది దొరికినా అమృతోపమానంగా వుంటుంది. ఆ అడవిలోనే తిరిగి గాలికి రాలిన పండ్లు ఏరుకొని ఆరగించాను.

నడి సముద్రంలో వున్న నావకు ఏది ఆధారమో నాకూ అదే ఆధారమైంది. అదంతా భగవంతుడి మీద భారంవేశాను. ఇంటిదగ్గరి కష్టాలు తప్పించుకోటానికిగాను యింకొక చోటికి పోతున్నాను. కాని అవినన్ను వదిలేటట్టులేవు! వాటిననుభవించే వాడు లేడని నన్ను కల్పించాడేమో! దుఃఖంలో గూడా ఆశకు తావుంది! ఏనాటికైనా గట్టెక్క లేక పోతానా అనే ఆశను కల్పిస్తుంది. దానినే జీవితాశ అంటారు. అది లేకపోతే మనుష్యుడు పశువుతో సమానమే! కాని 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు అత్యాశకూడదు! నిరాశతో కుమిలి పోయే హృదయాలలో గూడా ఆశాలేశానికి తావుంది. కాని అది నిస్పృహ, నిట్టూర్పులచేత కప్పబడి వుంటుంది.

పిల్లగాలి మెల్లన వీస్తుంది. అష్టమి చంద్రుడు చిన్న చిన్న మేఘపంక్తులను ముద్దు పెట్టుకుంటూ ఆడుకొంటున్నాడు. ప్రశాంతత అన్నివైపుల తాండవిస్తున్నది. ఆకాశాన చుక్కలు మినుకు మినుకు మంటూ చంద్రుడిని వెక్కిరిస్తూ ఆడుకుంటున్నాయి. పరస్పరానురాగంతో మేనులు మరచి హాయిగా సంచరిస్తున్నాయి. వాటికెప్పటికీ ఎడబాటులేదా అని పించింది నాకు.

నిర్జనకీకారణ్యంలోంచి కంటకయుతమైన బాటలో నడచి పోతున్నాను. వంటిన వున్నదుస్తులు ఆరిపోయినై. వర్షంలో తడిసి నానిపోవటం మూలకంగా జలుబు చేసింది. చెవులు పోట్లు పుట్టినై. దీనికితోడు శరీరంలో వున్న ముళ్ళబాధ. అంతా ఒకటేబాధ! అన్నిబాధలూ ఒకటే అవుతున్నాయి. మెల్ల మెల్లగా కొంతదూరం నడచి పోయి ఆ అడవి ప్రదేశాన్ని దాటగలిగాను. చిన్న మైదానం ప్రవేశించాను. చంద్రుడి మోము చిన్నదై పోతున్నది. మసక చీకటిగా వుంది. తూర్పున ఉషఃకాంతులు గోచరిస్తున్నాయి. పక్షులు కిల కిల మన్నాయి. చుక్కలు వెల్ల వెలపోయినాయి!

## ౨

దూరాన ఒకచిన్న గుడిసె కనిపించింది. ఈప్రదేశంలో ఎవరుంటారబ్బా అనిపించింది. ఏమోనను కుంటూ అక్కడికి త్రోవతీశాను. దగ్గరకు వెళ్లాను. అప్పుడే అక్కడొకడు నాగస్వరం ఊదుతూ పాముని ఆడిస్తున్నాడు. వాళ్ళు పాములవాళ్ళని తెలుసు కుంటానికి అట్టే ఆలస్యం పట్టలేదు. కాసేపు దూరంగావుండి ఆటచూస్తున్నాను. అతడు తలెత్తి చూశాడు. నేనతని కంటపడ్డా! ఆశ్చర్యంగా చూస్తూ ఏదో అడిగాడు. ఆభాషనాకు తెలియలేదు. నాకు తెలియటం లేదన్నాను. నామాటలర్థమైనాయా తనికి! 'ఎవరు నువ్వు' అన్నాడు. ఏమని చెప్పను? ఈ పాములవాళ్ళకు అన్ని భాషలూ వచ్చును. దేశం తిరగటం మూలకంగా ఎక్కడ ఏభాష ప్రచారంలో వుంటుందో అదిపట్టు బడి పోతుంది. వీళ్ళూ అలాటివాళ్ళే. ఇప్పుడు నామాటలతనికి తెలిసినై. నాభాష అర్థమైంది. మళ్ళీ 'ఎవరు నువ్వు' అన్నాడు. 'తల్లీదండ్రీలేని అనాథబాలుడిని' అన్నాను.

'ఎందుకొచ్చావు?'

'ఉండటానికిచోటు తినటానికితిండీ లేక!'

నాకళ్ళల్లోకి పరీక్షగా చూశాడు. తలపంకించాడు. వాళ్ళభాషలో ఎవర్నో పిలిచాడు. లోపలి నుండి ఒక స్త్రీ వచ్చింది. అతని భార్య అనుకున్నాను. వాళ్ళభాషలో నన్నుచూస్తూ ఏదో చెప్పాడు. ఆమెలోపలికి పోయింది. అప్రదేశమంతా ఒకేవిధమైన దుర్గంధంతో నిండివుంది. ఆస్త్రీ ఒక మూకుడుల్లో ఏదో తీసుకు వచ్చింది. అతడందుకొని నాకిచ్చాడు. ఏమిటని చూచాను.



(సశేషము)